


డిజిటల్ తోడు..
ఒంటరి గుండెకు నీడ

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త


తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -44 బుధవారం 15 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 4 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు
# పూర్తి చేస్తాం





**ఇందిరమ్మ పాలనలో సంక్షేమం, అభివృద్ధి**

**గృహజ్యోతితో అర్హులందరికీ ఉచిత విద్యుత్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**గద్వాల జిల్లాలో రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాలు ప్రారంభం**

**జోగులాంబ గద్వాలజులై 14(జర్నలిస్ట్ వార్త)::** పాలమూరు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి వ్యవసాయానికి సాగునీరు అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన డిప్యూటీ సీఎంకు**మిగతా 2లో...**

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక


**కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు**




**హైదరాబాద్,జులై 14(జర్నలిస్ట్ వార్త)::** 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను కేంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ **మిగతా 2లో...**

## ట్రంప్ యూటర్న్

**:హార్ముజ్ పై 20 శాతం టోల్ ప్రతిపాదన వెనక్కి!**



**ఢిల్లీ జులై 14(జర్నలిస్ట్ వార్త)::** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హార్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు **మిగతా 2లో...**




## ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ..

**గడువును జులై 24 వరకు పెంచుతూ ఈసీఐ నిర్ణయం**

**రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అభ్యర్థన మేరకు సవరించిన షెడ్యూల్ విడుదల**

**ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి**

**అమరావతి,జులై 14(జర్నలిస్ట్ వార్త)::** ఏపీలో ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ గడువు నేటితో (జులై 14) ముగియాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికానందున గడువును**మిగతా 2లో...**

**కాపు ఉద్యమ నేత**

## ముద్రగడ కన్నుమూత

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**



**హైదరాబాద్ జులై 14(జర్నలిస్ట్ వార్త)::** వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి(73) మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. కిడ్నీ సమస్యలతో గత నెల 16న హైదరాబాద్ గచ్చిబౌలిలోని **మిగతా 2లో...**

## ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి**




## ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభించాలి

**ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు**

**రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి**

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**



**న్యూఢిల్లీజులై 14(జర్నలిస్ట్ వార్త)::** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని,

## అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయాలను నిర్మించండి

**ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి**

**కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ ఎయిర్‌పోర్టు**

**ఆదిలాబాద్ భూసేకరణా చేపడతాం : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్‌రెడ్డి**




**హైదరాబాద్‌జులై 14(జర్నలిస్ట్ వార్త)::** తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా ఈ రెండు విమానాశ్రయాలకు ఉన్న సానుకూల అవకాశాలు, పరిస్థితులను సీఎం వివరించారు.

## ఏసీబీ వలలో హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి..

**హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్‌పై ఏసీబీ కేసు**

**అక్రమాస్తుల ఆరోపణలపై ఏకకాలంలో సోదాలు**

**రికార్డుల ప్రకారం రూ.9.24 కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు**



**హైదరాబాద్ జులై 14(జర్నలిస్ట్ వార్త)::** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించిన అధికారులు,**మిగతా 2లో...**

## మత్స్యకార కుటుంబాలకు జగన్ అండ





**ఒక్కో కుటుంబానికి 7లక్షల సాయం ప్రకటన**

**బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్**

**ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది**

**మత్స్యకార కుటుంబాలకు జగన్ పరామర్శ**

**సర్కార్ తీరుపై మండిపడ్డ వైసిపి అధినేత**

**విశాఖపట్నం,జులై 14(జర్నలిస్ట్ వార్త)::** విశాఖలో బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార **మిగతా 2లో...**

# పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

**మొదటి పేజీ తరువాయి**

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు ఇతర జిల్లా అధికారులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్ కు చేరుకున్న భట్టి జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కేవీ ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రారంభించారు. అనంతరం మల్దకల్ మండలం కుర్తిరావులచెరువు గ్రామానికి మంత్రులు చేరుకున్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో మంత్రులను సన్మానించారు. ఈ సందర్భంగా గద్వాల నియోజకవర్గంలో కుర్తిరావులచెరువుతోపాటు ఆరగిద్ద, తుమ్మలచెరువు, సోంపురం, పరుమాల, తురుకోనిపల్లి, పెద్దపాడు, ఉలిగేపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలను మంత్రులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. గట్టు మండలం రాయపురం వద్ద రూ.48 కోట్ల నిధులతో 132/33 కెవి విద్యుత్ ఉప కేంద్రం, గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద రూ.3.05 కోట్ల నిధులతో జిల్లా స్టోర్స్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ ఫార్మర్లను



పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సీఎం రేవత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ లో వలసలను సంపూర్ణంగా రూపుమాపి అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేశామన్నారు. అధికారంలోకి రాగానే గృహజ్యోతి పథకంలో అర్హులైన ప్రతి ఇంటికీ నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ఏడాదికి రూ. 20 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందజేస్తున్నా మన్నారు. రాబోయే ఐదేండ్లలో రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించడమే ధ్యేయంగా ముందు కెళ్తున్నామన్నారు. ఇటీవల రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశామని తెలిపారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ఉచిత బీమాను వర్తింప చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం, వడ్లకు రూ. 500 బోనస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో రూ.10 లక్షల వైద్య సేవలు వంటి పథకాలు ప్రజాపాలనలోనే సాధ్యమన్నారు. ఎంపీ మల్లు రవి పుట్టిన రోజు సందర్భంగా అభిమానులతో కలిసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మెన్ గట్టు తిమ్మప్ప, గొర్రెలు, మేకల అభివద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మెన్ హనుమంతు, మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ నాగరాజు, డీఈ రవి ప్రసాద్ పాల్గొన్నారు.

# ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ..

**మొదటి పేజీ తరువాయి**

పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) చేసిన విజ్ఞప్తికి ఈసీఐ సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

**గడువు పెంపునకు దారితీసిన కారణాలు**

గత నెల రోజులుగా ఏపీ వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూసే ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టారు. జులై 13 నాటికి దాదాపు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. నిర్దేశిత గడువు సమీపిస్తున్నా ప్రక్రియ వంద శాతం పూర్తికాకపోవడంతో, గడువును పొడిగించాలని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరాయి. పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సీఈవో.. ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు మరింత సమయం అవసరమని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ఈసీఐ, గడువు పొడిగింపునకు అంగీకారం తెలిపింది.

**సవరణలో వెల్లడైన కీలక గణాంకాలు**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలు మొత్తం 4,16,26,144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. సోమవారం నాటికి 3,69,50,812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశారు. ఈ ప్రక్రియలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 మంది ఓటర్లు మరణించినట్లు అధికారులు గుర్తించారు.

అలాగే, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో 12,14,994 మంది ఓటర్లు తమ చిరునామా నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తేలింది. బీఎల్‌వోలు సర్వేకు వెళ్లిన సమయంలో 7,26,425 మంది ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేరని నివేదికలో పేర్కొన్నారు. ఇంకా 9 శాతానికి పైగా ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో, పొడిగించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**సవరించిన షెడ్యూల్ వివరాలు**

కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం సవరించిన తేదీలు ఈ విధంగా ఉన్నాయి:

ఎస్ఐఆర్ ప్రక్రియ చివరి తేదీ: జులై 24

ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ: జులై 31

అభ్యంతరాలు, చేర్పులు, మార్పుల స్వీకరణ: జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు

అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి గడువు: సెప్టెంబరు 28

ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ: అక్టోబరు 3

ఈ పొడిగించిన గడువుతో ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు అవకాశం లభించిందని అధికారులు భావిస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత పౌరులు తమ వివరాలను సరిచూసుకుని, ఏవైనా అభ్యంతరాలుంటే నిర్దేశిత సమయంలోగా తెలియజేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

# మత్స్యకార కుటుంబాలకు జగన్ అండ

**మొదటి పేజీ తరువాయి**

కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. బోటు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌కు తమ కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు.. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 1న ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. కేవలం పది మైళ్ల దూరంలోనే ఘటన జరిగింది. జులైన 4న చిన్నా ఫోన్‌చేసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. దురదృష్టవశాత్తు ఫోన్ చేసిన కాసేపటికే బోటు ప్రమాదం జరిగింది. ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రమాదం జరిగిందని అధికారులకు మెసేజ్ చేశారు. రాత్రి 10:30కి కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టారు. వెంటనే స్పందిస్తే గంటల్లోనే మత్స్యకారులు దొరికేవారు. వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు. ఈనెల 5న చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడారు. తప్పుడు జరిగింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారు. త్రీమెన్ కమిటీ నివేదిక అంతా తప్పుల తడక. చంద్రబాబు ప్రభుత్వానికి మానవత్వం ఉందా? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే ఒక్క అధికారి రాలేదు. ఉత్తరాంధ్ర మంత్రులు ఒక్కరు కూడా రాలేదు. బాధితులను ఫిషరీష్ మంత్రి కూడా పరామర్శించలేదు. బాధితుల వద్దకు మంత్రులను పంపాలని సీఎంకు తెలియదా?. రాత్రికి రాత్రే స్పందిస్తే మత్స్యకారులు బతికేవారు. ఎక్స్ గ్రేషియా కింద అరకొర సాయం చేశారు. బాధితులకు రూ.కోటి చొప్పన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఏడుగురు మత్స్యకారులకు కుటుంబాలకు పరిహారం అందాలన్నారు. 5 లక్షలు ముష్టి వేస్తున్నావా.. ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు, కొత్త ఇల్లుమన ప్రభుత్వం వచ్చాక నెలలోపే ఆదుకుంటాం. గతంలో మా ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా ఉండేది. 2018 పాదయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాట నెరవేర్చాం. పాక్‌లో చిక్కుకున్న మత్స్యకారులను సేఫ్‌గా తీసుకొచ్చాం అని వైఎస్ జగన్ గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారుల కోసం 10 ఫిషింగ్ హార్బర్‌లకు శ్రీకారం చుట్టాం. మరో 6 ఫిష్ ల్యాండ్‌పనులు కూడా చేపట్టాం. ఈ రోజు ఫిషింగ్ హార్బర్‌లను స్కామ్‌లతో అమ్మేస్తున్నారు. ఏపీలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ప్రభుత్వ స్కూల్ పిల్లలకు బుక్స్, యూనిఫాంలు లేవు. రాష్ట్రంలో రైతు రో÷-డడెక్కే పరిస్థితి ఉంది. ప్రజలతో బాబు చెలగాటమాడుతున్నారు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఒక్కో కుటుంబానికి 7లక్షల సాయం ప్రకటన**


మత్స్యకార కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు దీని గురించి వివరాలు తెలిపారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.7 లక్షల చొప్పున అందిస్తామని కేకే రాజు చెప్పారు. ఈ డబ్బును వైఎస్సార్‌సీపీ తరఫున అందిస్తామని అన్నారు. ప్రాణాలతో బయటపడ్డ చిన్నా కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని వివరించారు. చిన్నా కుటుంబానికి రూ.7 లక్షల సాయం చేస్తామని చెప్పారు. ఇటీవల విశాఖ తీరంలో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అదే ప్రమాదంలో మృత్యువుతో పోరాడి ప్రాణాపాయం నుంచి బయటపడిన కారి చిన్నాను కూడా వైఎస్ జగన్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## ఓటు హక్కు నమోదు చేసుకో... ఓటు విలువ తెలుసుకో...

# అభివృద్ధికి బాటలు వేసే నాయకులను ఎన్నుకో

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన హక్కు ఓటు హక్కు. ఈ హక్కును వినియోగించాలంటే ముందుగా ఓటు హక్కు నమోదు చేసుకోవడం అత్యంత అవసరం. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలి. ఓటరు జాబితాలో పేరు లేకుంటే ఎన్నికల రోజున ఓటు వేయలేరు. అందువల్ల "ముందు ఓటు హక్కు నమోదు... తర్వాత ఓటు వినియోగం" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

ఓటు అనేది కేవలం ఒక గుర్తు కాదు. అది ప్రజల భవిష్యత్తును నిర్ణయించే శక్తి. ఒక మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం. రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల ప్రగతి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి, మెరుగైన విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సౌకర్యాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అనేక అంశాలు ప్రజలు ఎన్నుకునే నాయకత్వంపై ఆధారపడి ఉంటాయి. అందుకే ఓటు హక్కు విలువను ప్రతి పౌరుడు తెలుసుకోవాలి. 18 సంవత్సరాలు నిండిన యువత తమ ఓటు హక్కు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో పరిశీలించాలి. పేరు లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలి. పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉంటే వాటిని సవరించుకోవాలి. కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగువారు కూడా ఓటరుగా నమోదు అయ్యేలా చైతన్యం కల్పించడం ప్రతి




బాధ్యతగల పౌరుడి కర్తవ్యం. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలకు లొంగి ఓటు వేయడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. ప్రజల కోసం పనిచేసే, అభివృద్ధికి కట్టుబడి ఉండే, నిజాయితీ కలిగిన నాయకులను మాత్రమే ఎన్నుకోవాలి. కులం, మతం, ప్రాంతీయత కంటే ప్రజాసేవ, పారదర్శకత, పనితీరును ప్రమాణంగా తీసుకోవాలి. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం, ఎన్నికల అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. ఓటరు నమోదు కార్యక్రమాలు, ఓటరు జాబితా సవరణలు, ఎన్నికల నిర్వహణలో ప్రజలు పూర్తి సహకారం అందించాలి. సరైన సమాచారం అందించడం, ఎన్నికల నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి ప్రజల చేతుల్లోనే ఉంది. ఆ శక్తి పేరు ఓటు. అందుకే ప్రతి పౌరుడు ముందుగా ఓటు హక్కు నమోదు చేసుకుని, ఎన్నికల రోజున తప్పనిసరిగా తన ఓటు హక్కును వినియోగించాలి. మన ఒక్క ఓటు రాష్ట్ర భవిష్యత్తును మార్చగలదు. అభివృద్ధి, సుపరిపాలన, ప్రజాసంక్షేమం కోసం బాధ్యతాయుతంగా ఓటు వేయాలి. ఓటు హక్కు నమోదు చేసుకోండి. ఓటు విలువ తెలుసుకోండి. అభివృద్ధికి అంకితమైన నాయకులను ఎన్నుకోండి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి...

కేంద్ర ఎన్నికల సంఘం, ఎన్నికల అధికారులకు సంపూర్ణ సహకారం అందించండి. బలమైన రాష్ట్ర నిర్మాణంలో మీ ఓటుతో భాగస్వాములు కండి.

సీనియర్ జర్నలిస్ట్
కొట్టే సుధాకర్ (లెనిన్)
జిల్లా కార్యవర్గ సభ్యులు
టీయూడబ్ల్యూజేయు (ఐజేయూ)
9908401581



# కాపు ఉద్యమ నేత ముద్రగడ కన్నుమూత

**మొదటి పేజీ తరువాయి**

ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చేరారు. అప్పటి నుంచి అక్కడ ముద్రగడకి చికిత్స జరుగుతోంది. అయితే సాయంత్రం పరిస్థితి విషమించడంతో ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రాణాలు కోల్పోయారు. ముద్రగడ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి. 1953 జనవరి 22న ఆయన జన్మించారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తన జీవిత కాలంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, ఒకసారి ఎంపీగానూ ఆయన పని చేశారు. ముఖ్యంగా కాపు ఉద్యమ నేతగా ఆయనకు మంచి గుర్తింపు లభించింది. తండ్రి మరణానంతరం 1977లో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జనతా పార్టీ తరఫున ప్రత్తిపాడు నుంచి విజయం సాధించారు. 1982లో తెదేపాలో చేరిన ముద్రగడ.. 1983, 1985, 1989 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం ఆ పదవితో పాటు తెదేపాకు రాజీనామా చేశారు. ప్రజారక్షణ సమితి, తెలుగునాడు పార్టీలను ముద్రగడ పద్మనాభం స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా గెలుపొందారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ఆయన.. ఆ సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం దీక్ష చేశారు. 2016లో తునిలో కాపు ఐక్య గర్జన సభ నిర్వహించారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

**మొదటి పేజీ తరువాయి**

మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి మన్సుక్ మాండవియను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేసారు.

# ట్రంప్ యూటర్న్

**మొదటి పేజీ తరువాయి**

ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిజానికి సోమవారం నాడే ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి.

మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.

# ఏసీబీ వలలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారి..

**మొదటి పేజీ తరువాయి**

రికార్డుల ప్రకారం సుమారు రూ.9.24 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు.

ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, అవినీతి నిరోధక చట్టం 1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బీ), 13(2) కింద రవీందర్‌పై కేసు నమోదైంది. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీలకు సంబంధించిన మరో తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటిలో కొండకల్, కిష్టాపూర్, పసమాముల గ్రామాల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రాంగూడలో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు ఫ్లాట్లు, కొండాపూర్ మసీద్ బండలో రూ.3 కోట్ల విలువైన జీ+4 భవనం, మోకిలలో రూ.1.33 కోట్ల విలువైన సెమీ-ఫినిష్డ్ విల్లా ఉన్నాయి. ఈ ఆస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన దానికంటే చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.

వీటితో పాటు రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.45.06 లక్షలు, రూ.36.7 లక్షల విలువైన 1.44 కిలోల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, నాలుగు వాహనాలు, ఇతర గృహోపకరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవీందర్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, మరిన్ని ఆస్తుల వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

# ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభించాలి

**మొదటి పేజీ తరువాయి**

నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్,జులై 14(జర్నలిస్ట్ వార్త)::** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్ఒలకు వెంటనే అందజేసి మీ యొక్క అమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్ఒలకు అందించాలని సిఇఒ కోరారు.

ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారు. సర్ పక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ పక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్ఒలకు అందజేయాలని సూచించారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
బుధవారం 15 జులై 2026

# ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**ఎల్కతుర్తి,/ జూలై 14 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు ముస్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగన్నాథపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఆరెపల్లి భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు బండి కుమారస్వామి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పార్టీలో చేరిన నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, హనుమాన్ దేవస్థానం కమిటీ చైర్మన్ పెండ్యాల భాస్కర్, వార్డు సభ్యుడు ఆరెపల్లి చిరంజీవి, రేణుక ఎల్లమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ పంజాల చటరీ, పెండ్యాల తిరుపతి, పంజాల ఉప్పలయ్య, పంజాల స్వామి, పంజాల కనకయ్య, పంజాల రమేష్, మాజీ వార్డు సభ్యుడు పంజాల శ్రీనివాస్, యువ కాంగ్రెస్ నాయకుడు పంజాల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలకు ఆగస్టు 7 వరకు అవకాశం



**నర్సంపేట,/ జూలై 14:( జర్నలిస్ట్ వార్త)** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఆగస్టు 7 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. పూర్ణచందర్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉద్యోగం చేస్తూనే లేదా ఇతర కారణాలతో రెగ్యులర్ విద్య కొనసాగించలేని వారికి దూరవిద్య మంచి అవకాశమని పేర్కొన్నారు. అతి తక్కువ ఫీజుతో ఉన్నత విద్యను అందిస్తున్న అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. డిగ్రీ ప్రవేశాల కోసం లర్నర్ సపోర్ట్ సెంటర్229, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేటను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రెగ్యులర్ ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, రెండేళ్ల ఐటీఐ, పాలిటెక్నిక్ ఉత్తీర్ణులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని వివరించారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది కే. నరేష్, బి. శివతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 73829 29577 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# ఎన్యుమరేషన్ ఫారం ఇస్తేనే ఓటు. లేదంటే జాబితాలో పేరు గల్లంతే..!

## -తహసీల్దార్ నాగరాజు.



**బయ్యారం,జులై 14, (జర్నలిస్ట్ వార్త)** ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా సర్ చేపడుతున్నామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మండలంలో జులై 24 వరకు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ,డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలు అందిస్తున్నామని వెల్లడించారు. సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపి బిఎల్ఓలకు ఇస్తేనే తుది ఓటరు జాబితాలో పేరు ఉంటుందని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి వ్యక్తికి రెండు ఎన్యూమరేషన్ పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. రెండు ఎన్యూమరేషన్ పత్రాలు నింపి,ఒకటి బిఎల్ఓకు ఇవ్వాలన్నారు. రెండో ఎన్యుమరేషన్ పత్రాన్ని ఓటర్లు తమ వద్దే ఉంచుకోవాలని చెప్పారు. ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపి ఇస్తేనే ఓటరు ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉంటుందని వెల్లడించారు. ఎన్యూమరేషన్ పత్రము ఇవ్వకపోతే ఓటు తొలగించే అవకాశం ఉంటుందన్నారు. ఓటు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు సమాచారం ఇచ్చి,వారి వివరణ తీసుకున్న తర్వాతనే ఓటు తొలగిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ ఎన్యూమరేషన్ పత్రాలు నింపవచ్చని తహసీల్దార్ అన్నారు. ఇసి వెబ్‌సైట్‌లో ఎన్యుమరేషన్ ఫారం సమర్పించవచ్చని తెలిపారు. ఓటర్ సవరణ నిరంతరం జరిగే ప్రక్రియ అని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు జరిగేది స్పెషల్ సమ్మరి రివిజన్ అని, ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుందని తహసీల్దార్ నాగరాజు వివరించారు.

# బయ్యారం సొసైటీ చైర్మన్ పై అనర్హత వేటు..





**బయ్యారం/,జులై 14.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది సుంకర రజనీ బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డికి బయ్యారం సొసైటీ పరిధిలో ఎటువంటి వ్యవసాయ భూమి లేదని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం పొందడానికి,చైర్మన్ పదవికి అవసరమైన అర్హతలు కలిగి లేరని కలెక్టర్ కు పిర్యాదు చేశారు. పిర్యాదు అందుకున్న కలెక్టర్ సొసైటీ సబ్ రిజిస్ట్రార్ రమేష్ ని విచారణ అధికారిని నియమించారు. విచారణ అధికారి రమేష్ సమగ్ర విచారణ జరిపి జనవరి 1 2026న తన నివేదికను కలెక్టర్ కు సమర్పించారు. ఆ నివేదికలో మూల మధుకర్ రెడ్డికి ఎటువంటి పట్టా భూమి లేదని తెల్చారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి తన నివేదికలో కూడా వ్యవసాయ భూమి ఏదీ లేదని నివేదిక సమర్పించారు. విచారణ నివేదికను అందుకున్న జిల్లా సహకార అధికారి విజయలక్ష్మి బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డిని సొసైటీ కమిటీ చైర్మన్ పదవి నుండి ఈ నెల 13న తొలగించినట్లు తెలిపారు. సొసైటీకి చెందిన అన్ని అధికారిక రికార్డులు,నగదు నిల్వ,చెక్ బుక్, తాళాల పూర్తి బాధ్యతను సీఈఓకి అప్పగించాలని మధుకర్ రెడ్డిని ఆదేశించారు. మూల మధుకర్ రెడ్డికి రెడ్డికి ఇప్పటివరకు చెల్లించిన గౌరవ వేతనం,ప్రయాణ,దినసరి భత్యాలు (టీఏ&డిఏ) ఏవేనా ఉంటే వాటిని వసూలు చేసి వెంటనే సొసైటీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు.

తప్పుడు సమాచారం సమర్పించడం వల్ల చట్టపరమైన సహకార సంస్థను మోసం చేసినందుకు గాను మూల మధుకర్ రెడ్డిపై టీసీఎస్ చట్టం,సెక్షన్ 79 బీఎన్ఎస్ చట్టం ప్రకారం సదరు వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా సహకార అధికారి విజయలక్ష్మి తెలిపారు.

# రఘుపతిరెడ్డి మృతి తీరని లోటు

## దుండేటి వీరారెడ్డి నివాళి



**తల్లాడ,/ జూలై 14 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలానికి చెందిన మాజీ ప్రభుత్వ అధికారి, మాజీ సొసైటీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దగ్గుల రఘుపతిరెడ్డి అకాల మరణం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డి అన్నారు. రఘుపతిరెడ్డి మృతి వార్త తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ, రఘుపతిరెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం నుంచి పదవీ విరమణ అనంతరం సొసైటీ చైర్మన్‌గా ఎన్నికై రైతులు, ప్రజలకు విశేష సేవలు అందించారని తెలిపారు. ఎంపీటీసీగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఆయన అకాల మరణం బాధాకరమని, రఘుపతిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు.

# అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ

## జాబ్‌చార్ట్‌కు మించి పనులు.. వేతనాలూ సకాలంలో ఇవ్వట్లేదని ఆవేదన



**నర్సంపేట,/ జూలై 14 (జర్నలిస్ట్ వార్త):** అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో జాబ్‌చార్ట్‌కు మించిన పనులు చేయిస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి ఆరోపించారు. ఐసీడీఎస్ ప్రారంభమై 50 సంవత్సరాలు దాటినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పించకుండా గౌరవ వేతనం పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నాయని ఆమె విమర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్యలక్ష్మి సేవలు, ఎన్‌హెచ్‌టీఎస్, పోషణ్ ట్రాకర్ యాప్‌ల నిర్వహణతో పాటు ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నప్పటికీ చాలీచాలని వేతనాలతోనే పనిచేస్తున్నామని తెలిపారు. బీఎల్‌వో విధులు, ఇతర అదనపు పనులు అప్పగించడం వల్ల అంగన్‌వాడీ సేవలు దెబ్బతింటున్నాయని, పనిభారంతో సిబ్బంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రతి నెల గౌరవ వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని, జూన్ నెల వేతనాలు ఇప్పటికీ అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జూన్ నెల గౌరవ వేతనాలు విడుదల చేయడంతో పాటు, ఇకపై ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నల్ల భారతి డిమాండ్ చేశారు.

# అరెస్టులతో అడ్డుకున్న చలో సచివాలయం



**హసన్‌పర్తి,/ జూలై 14 (జర్నలిస్ట్ వార్త):** ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన చలో సచివాలయం కార్యక్రమానికి వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు, కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు సాయి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న శాంతియుత కార్యక్రమాన్ని అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకతీయ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కచనపల్లిలో సర్ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్.



**బయ్యారం/,జులై 14.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల తహసీల్దార్ నాగరాజు మంగళవారం కచనపల్లి గ్రామపంచాయతీలో పర్యటించారు. అనంతరం సర్పంచ్ యలం రేవతి ని గ్రామంలో జరుగుతున్న సర్ ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ యలం రేవతి మాట్లాడుతూ గ్రామంలో ఓటర్లు అందరికి బిఎల్ఓల ద్వారా ఫారాల పంపిణీ జరిగిందని ఓటర్లకి గ్రామ బిఎల్ఓలు ఎప్పటికప్పుడు అందుబాటులో వుంటున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రాథమిక పాఠశాల,అంగన్వాడీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ,స్థానిక బిఎల్ఓలు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీఎంఎస్ బ్రిక్స్ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణాకర్

## కార్మికుల సమస్యలపై చర్చ




**హనుమకొండ/జూలై14(జర్నలిస్ట్ వార్త)** బీఎంఎస్ నిర్వహించిన బ్రిక్స్ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. కరుణాకర్ పాల్గొన్నారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ కార్మికుల అభివృద్ధి, సంక్షేమమే బీఎంఎస్ ప్రధాన లక్ష్యమన్నారు. కార్మిక వర్గానికి సంబంధించిన అంశాలపై చర్చ జరిగే ఈ సమావేశంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

# సర్వే దరఖాస్తులు త్వరగా పూర్తి చేయాలి

## ముప్పారంలో ప్రత్యేక అధికారి ఆదేశం



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరోజూలై 14: (జర్నలిస్ట్ వార్త)** ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన జాతీయ సర్వే కార్యక్రమంలో మండల ఉప తహసీల్దార్, ప్రత్యేక అధికారి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఓటరు జాబితా పరిశీలకులు, గ్రామ పంచాయతీ బాధ్యులతో సమావేశమై సర్వే దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి అంతర్జాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. మండలంలోనే ముప్పారం గ్రామాన్ని సర్వే పూర్తి చేసిన తొలి గ్రామంగా నిలపాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారి పాక భిక్షపతి, బాధ్యుడు రాకేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు ముంజ వెంకటరాజం గౌడ్, ఓటరు జాబితా పరిశీలకులు గై పద్మ, బాణాల రమాదేవి, బోళ్ల సరిత, సిద్ధంకి మంజుల, చామల మహేందర్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్, గుర్రాల శ్రీనివాస్, మర్రిపెల్లి రాజు, కృష్ణ, జీయర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# హుండీ తాళం ధ్వంసం ఘటనపై చర్యలు తీసుకోవాలి

## పోలీసులకు గ్రామస్తుల ఫిర్యాదు



**తల్లాడ, /జూలై 14: (జర్నలిస్ట్ వార్త)** తల్లాడ మండలం కేశపురం గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో హుండీ తాళం ధ్వంసం ఘటన వివాదానికి దారితీసింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుల కథనం ప్రకారం, ప్రతి ఏడాది జూలై 5న జరిగే అమ్మవారి వార్షికోత్సవానికి భిన్నంగా కొందరు జూలై 3న ఉత్సవాలు నిర్వహించి ప్రత్యేక హుండీ ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం ఆ హుండీని తీసుకెళ్లి, ఆలయంలో ఉన్న హుండీకి తాళం వేసి, తాళానికి వెల్డింగ్ చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో వనిగండ్ల మాధవరావు, సారం రమేష్, వనిగండ్ల అశోక్, కట్ట రమాకాంత్, సాదం నరేష్, కట్ట శ్రీనివాసరావు, చావా తిరుపతిరావు పాల్గొన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మన్నెపల్లి రామారావు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఫైలేరియా గుర్తింపునకు టాస్ సర్వే

**తల్లాడ, /జూలై 14:( జర్నలిస్ట్ వార్త)** మండలంలోని కుర్నవల్లి గ్రామంలో ఫైలేరియా వ్యాధి గుర్తింపునకు టాస్ (టెస్టింగ్, అసెస్‌మెంట్ అండ్ సర్వే) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపిక చేసిన ఇంటి సభ్యులందరి నుంచి రక్త నమూనాలు సేకరించి, మైక్రో ఫైలేరియా క్రిమిని గుర్తించేందుకు ర్యాపిడ్ టెస్ట్ కిట్లతో పరీక్షలు చేపట్టారు. పాజిటివ్‌గా తేలిన వారికి పూర్తి స్థాయి రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి చికిత్స అందించనున్నట్లు అధికారులు తెలిపారు. సమాజంలో ఫైలేరియా వ్యాప్తి స్థాయిని అంచనా వేయడం, బాధితులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం, అంగవైకల్యాన్ని నివారించడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడమే టాస్ సర్వే లక్ష్యమని పేర్కొన్నారు. సర్వేను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, లక్ష్మణ్, జిల్లా మలేరియా అధికారి కే. వెంకటేశ్వర్లు పరిశీలించి, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# చేపల కేంద్రం కూల్చివేతపై విచారణ జరపాలి

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. బీజేపీ నేత బుచ్చి రాములు










**హసన్‌పర్తి, /జూలై 14 (జర్నలిస్ట్ వార్త);** ఎల్లాపూర్ గ్రామంలోని చేపల ఉత్పత్తి కేంద్రం భవనాలు, శిలాఫలకాలు ధ్వంసం చేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ స్వయంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎల్లాపూర్65 డివిజన్ జోనల్ ప్రధాన కార్యదర్శి వెలిశోజు బుచ్చి రాములు కోరారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్246లో చేపల ఉత్పత్తి కేంద్రానికి కేటాయించిన భూమిలో 1973లో అప్పటి కేంద్ర మంత్రి సి. సుబ్రహ్మణ్యం కేంద్రాన్ని ప్రారంభించారని, దీనికి సంబంధించిన శిలాఫలకం, గోదాం, అతిథి గృహం, నీటి బావి తదితర నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. అయితే, తహసీల్దార్ కోరిన నివేదికలో మత్స్యశాఖ అధికారులు అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేవని పేర్కొనడం విచారకరమన్నారు.ఆర్‌టీఐ ద్వారా పొందిన సమాచారంలో నిర్మాణాలు ఉన్నట్లు స్పష్టమైందని, అయినప్పటికీ అధికారులు వాస్తవాలను విస్మరించారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిలోని నిర్మాణాలను కూల్చివేసిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత వ్యక్తులు పట్టాదారులైతే వారి పట్టాదారు పత్రాలను బహిరంగపరచాలని సవాల్ చేశారు. కలెక్టర్ స్వయంగా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమిని పరిరక్షించే చర్యలు తీసుకోవాలని, చేపల ఉత్పత్తి కేంద్రం ఉన్న ప్రాంతంలో గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మంద రాజయ్య, మంద బజారు, మంద నాంపల్లి, బొల్లికొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు అగ్రవర్ణ పార్టీలను వీడితేనే రాజ్యాధికారం

**చింతకింది కుమారస్వామి -సకల రంగాల్లో వాటా కోసం బీసీలంతా ఏకం కావాలి**

**వర్ధన్నపేట బీసీ హక్కుల సాధన సమితి సమావేశంలో పిలుపు**



**వర్ధన్నపేట/జులై14(జర్నలిస్ట్ వార్త):** బీసీలు అగ్రవర్ణ పెట్టుబడిదారీ పార్టీలను వదిలి బయటకు వస్తేనే రాజ్యాధికారంతో పాటు సకల రంగాలలో తమ వాటా సాధించుకోగలరని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. వర్ధన్నపేటలో మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు పనాస ప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు.1931 తర్వాత దేశంలో బీసీ కులగణన జరగలేదని, కాకాలేల్కర్, మండల్ కమిషన్ సిఫారసులను నాటి కాంగ్రెస్, జనతా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం 27% రిజర్వేషన్లు ప్రకటించగా, బీజేపీ రామజన్మభూమి అంశంతో దాన్ని పక్కదోవ పట్టించిందని ఆరోపించారు. విద్య, వైద్య రంగాలను ప్రైవేటుపరం చేస్తూ అగ్రవర్ణ పార్టీలు బీసీలకు ద్రోహం చేస్తున్నాయన్నారు. కేసీఆర్ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై చూపిన ఉత్సాహం బీసీలపై చూపలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కి, జీవో 29 ద్వారా ఉద్యోగ అవకాశాలు దక్కకుండా చేస్తోందని మండిపడ్డారు. ఉచితాల పేరుతో మోసపోకుండా, భవిష్యత్ తరాల కోసం బీసీలంతా ఏకమై రాజ్యాధికారం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సాయిలు, ఐలయ్య, ఆనందం, ప్రభాకర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారంలో ఘనంగా భూ రీసర్వే అవగాహన గ్రామసభ

**సహకరించాలని కోరిన ఆర్డీవో సుమా, సర్వే ఏడీ శ్రీనివాసులు**

**పాల్గొన్న ప్రజాప్రతినిధులు, మండల అధికారులు**



**వర్ధన్నపేట/జులై 14(జర్నలిస్ట్ వార్త)::** మండలంలోని చెన్నారం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమంపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా అమలు చేయనున్న ఈ రీసర్వే ప్రక్రియలో భాగంగా, మొదటి దశలో చెన్నారంలో రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు.సభకు ముఖ్య అతిథులుగా హాజరైన వరంగల్ ఆర్డీవో సుమా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు మాట్లాడుతూ భూ వివాదాల పరిష్కారానికి, పక్కా రికార్డుల రూపకల్పనకు రీసర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. రైతులు, భూ యజమానులు తమ భూముల సరిహద్దుల వివరాలను సక్రమంగా అందించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీవో వెంకట్ రామణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చారి, ఏఎంసీ చైర్మన్ నర్కుడు వెంకటయ్య, స్థానిక సర్పంచ్‌లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# వర్షాభావంతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

**: పనాస ప్రసాద్**

**ఎకరాకు రూ. 10 వేల చొప్పున సాయం అందించాలి**

**వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ధర్నా**




**వర్ధన్నపేట/జులై 14(జర్నలిస్ట్ వార్త):** సకాలంలో వర్షాలు పడక, నాటిన విత్తనాలు మొలకెత్తక పెట్టుబడులు కోల్పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.
వానలు లేక విత్తనాలు మొలవకపోవడంతో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన పేద, మధ్యతరగతి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. రైతు సంఘం జిల్లా నేతలు బొడ్డుపల్లి సాయిలు, మొగిలి మాట్లాడుతూ గ్రామ యూనిట్‌గా పంట బీమా వర్తింపజేసి రైతులకు మేలు చేయాలని, లేనిపక్షంలో పాలకులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మడ్డి రాజారం, లొంకా ఐలయ్య, మహేందర్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో

# నాలుగు దశాబ్దాల నిబద్ధత

## వర్ధన్నపేట అగ్నిమాపక కేంద్ర అధికారి జైపాల్ రెడ్డి అంతరంగం

ఐదు ప్రధాన మండలాల పరిధిలో అగ్ని ప్రమాదాల నివారణకు అహర్నిశలు శ్రమిస్తూ, ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారిస్తున్న వర్ధన్న పేట అగ్నిమాపక కేంద్ర అధికారి జైపాల్ రెడ్డి గతో జర్నలిస్ట్ వార్త ప్రతినిధి ముఖాముఖి.





### ఒడిదొడుకుల ప్రస్థానం.. సేవకే అంకితం

**ప్రశ్న: నమస్కారం జైపాల్ రెడ్డి. 1987లో రక్షకభటుడిగా (కానిస్టేబుల్‌గా) మొదలైన మీ ప్రస్థానం, నేడు ఒక ప్రాంతానికి అగ్నిమాపక అధికారిగా ముగింపు దశకు చేరింది. నాలుగు దశాబ్దాల మీ సుదీర్ఘ అనుభవాన్ని ఎలా విశ్లేషిస్తారు?**

**జైపాల్ రెడ్డి:** నమస్కారం. నా వృత్తి జీవితం ఒక నిరంతర అభ్యాసం లాంటిది. 1987లో పరకాలలో కానిస్టేబుల్ తొలి నియమకం జరిగింది. అక్కడ 14 సంవత్సరాల రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యాను. ఆ తర్వాత నా జీవితాన్ని మలుపు తిప్పింది అగ్నిమాపక శాఖ. 2001లో వాహన చోదకుడిగా బాధ్యతలు చేపట్టాను. దాదాపు 20 సంవత్సరాల పాటు అగ్నిమాపక శకతాన్ని నడపడం అంటే కేవలం వాహనం నడపడం కాదు, మరణంతో పరుగు పందెం లాంటిది. రద్దీ రోడ్లు, ఇరుకైన సందులు, నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరాల్సిన ఒత్తిడి... వీటన్నింటినీ అధిగమించిన అనుభవమే నన్ను గత 6 ఏళ్లుగా అగ్నిమాపక కేంద్ర అధికారిగా విజయవంతంగా నడిపిస్తోంది. మరో 16 నెలల్లో పదవీ విరమణ చేయబోతున్నాను. నా సొంత మండలమైన వర్ధన్నపేటలోని కడారిగూడెం పరిధిలోనే సేవ చేస్తూ విరమణ పొందడం ఆత్మసంతృప్తిని ఇస్తోంది.

### ఆపరేషన్ హస్తగతం. తీవ్ర సవాళ్ల మధ్య 45 ప్రమాదాల ఛేదనం

**ప్రశ్న: గడిచిన ఏప్రిల్ నుండి ఈ మూడు నెలల కాలంలో రికార్డు స్థాయిలో అగ్ని ప్రమాద పిలుపులు వచ్చాయని విన్నాం. ఆ క్లిష్ట సమయంలో మీ బృందం ఎలా ఎదుర్కొంది?**

**జైపాల్ రెడ్డి:** అవును, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ఏప్రిల్ నుంచి ఈ మూడు నెలల కాలం మాకు అత్యంత పరీక్షా సమయం. ఈ స్వల్ప వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 44 అగ్ని ప్రమాద పిలుపులు వచ్చాయి. వీటన్నింటికంటే మించి ఒక అత్యంత ప్రమాదకరమైన భారీ ప్రమాదం ఎదురైంది. అగ్ని కీలలు ఎగిసిపడుతున్నప్పుడు సమయం చాలా ముఖ్యం. ఏ ఒక్క క్షణం ఆలస్యమైనా ప్రాణ, ఆస్తి నష్టాలు ఊహించని స్థాయిలో ఉంటాయి. ఆ భారీ ప్రమాదం జరిగినప్పుడు నేను స్వయంగా బృందాన్ని ముందుండి నడిపాను. వ్యూహాత్మకంగా మంటల తీవ్రతను అంచనా వేస్తూ, సిబ్బందిని సమన్వయపరుస్తూ ఆ సవాలును ఛేదించాం. ఎక్కడా చిన్న ప్రాణనష్టం కూడా జరగకుండా ప్రమాదాన్ని అదుపు చేయగలిగాం. మా సిబ్బంది చూపిన అసాధారణ ధైర్యసాహసాలే ఈ విజయానికి కారణం.

### విస్తారమైన పరిధి.. అప్రమత్తమైన సేవలు

**ప్రశ్న: వర్ధన్నపేట కేంద్రం పరిధి చాలా పెద్దది. ఐనవోలు, తొర్రూరు, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి లాంటి ఐదు మండలాలను ఏకకాలంలో ఎలా పర్యవేక్షిస్తున్నారు?**

జైపాల్ రెడ్డి: అవును, మా పరిధి చాలా విస్తృతమైనది. ఐదు మండలాల్లో భౌగోళిక పరిస్థితులు, జనాభా సాంద్రత వేర్వేరుగా ఉంటాయి. కానీ మా బృందంలో ఉన్న క్రమశిక్షణ, సమయపాలన వల్ల ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నాం. విధులను శాస్త్రీయంగా పంచుకుంటూ, 24 గంటలూ అప్రమత్తంగా ఉంటాము. ఏ క్షణంలో ఎక్కడి నుంచి అత్యవసర పిలుపు వచ్చినా, క్షణాల వ్యవధిలో స్పందించేలా మా అగ్నిమాపక శకతాన్ని, నివారణ సామగ్రిని సిద్ధంగా ఉంచుకుంటాం. బృందంలోని ప్రతి ఒక్కరి మధ్య ఉన్న పరస్పర సమన్వయమే ఈ ఐదు మండలాల ప్రజలకు నిరంతరాయంగా రక్షణ కల్పించడానికి మాకున్న ప్రధాన బలం.

### అగ్ని ప్రమాదాల నివారణా సమీక్ష: నిర్లక్ష్యం చేస్తే సర్వస్వం బూడిదే!

**ప్రశ్న: ప్రస్తుత కాలంలో పారిశ్రామికీకరణ పెరుగుతోంది. పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లో అగ్ని ప్రమాద నివారణా ప్రమాణాలు ఎలా ఉన్నాయి? మీరిచ్చే సూచనలు ఏంటి?**

**జైపాల్ రెడ్డి:** ఈ విషయంలో నేను చాలా స్పష్టంగా, కఠినంగా చెప్పాలనుకుంటున్నాను. నిర్లక్ష్యం వద్దు. అగ్ని రక్షణ చర్యలు ప్రతి ఒక్కరికీ విధిగా ఉండాలి. మన ప్రాంతంలో బియ్యం మిల్లులు, చమురు విక్రయ కేంద్రాలు, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు వేగంగా పెరుగుతున్నాయి. కానీ చాలా చోట్ల అగ్నిమాపక పరికరాలను కేవలం ప్రభుత్వ అనుమతి పత్రాల కోసమే ప్రదర్శిస్తున్నారు తప్ప, అవి పని చేసే స్థితిలో ఉన్నాయా లేదా అని పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా వాణిజ్య సంస్థల్లో వంటగ్యాస్ వాడకం ఎక్కువ. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నివారించాలనే ప్రాథమిక అవగాహన కూడా ఉండటం లేదు. అందుకే మా విభాగాన్ని కేవలం ప్రమాదాలు ఆర్పేందుకే పరిమితం చేయకుండా, ముఖీ/స్తు నివారణ చర్యల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, మిల్లులలో నిరంతరం ఉచితంగా ప్రత్యక్ష అవగాహన సదస్సులు ఇస్తున్నాం.

### ప్రజలకు విజ్ఞప్తి.. బాధ్యతాయుతమైన పౌరసత్వమే రక్షణ కవచం

**ప్రశ్న: చివరగా, మన గ్రామీణ ప్రాంత ప్రజలకు మీరేం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు?**

**జైపాల్ రెడ్డి:** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాదొక వినమ్రపూర్వకమైన విజ్ఞప్తి. గ్రామాల్లో పొలాల గట్లపై, రోడ్ల పక్కన చిన్నపాటి చెత్తను లేదా ఎండిన ఆకులను తగలబెట్టడం సహజం. చాలా సార్లు ప్రజలు ఆ చిన్నపాటి పొగను చూసి కంగారుపడి, లేదా ఉద్దేశపూర్వకంగానే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేస్తుంటారు. మేము ఆ చిన్న సంఘటన కోసం అగ్నిమాపక శకతాన్ని పంపినప్పుడు, అదే సమయంలో ఏదైనా బియ్యం మిల్లులోనో, లేదా నివాస గృహాల్లోనో పెద్ద ప్రమాదం జరిగితే మా వాహనం అందుబాటులో ఉండదు. వేరే ప్రాంతం నుంచి వాహనం వచ్చేసరికి జరగరాని నష్టం జరిగిపోతుంది. కాబట్టి చిన్న చిన్న వాటిని స్థానికంగానే నీళ్లు చల్లి ఆర్పేందుకు ప్రయత్నించాలి. ప్రజలు విచక్షణతో ఆలోచించి, నిజమైన అత్యవసర సమయాల్లోనే మా సేవలను వినియోగించుకోవాలని కోరుతున్నాను.

**వార్త ప్రతినిధి:** ఐదు మండలాల ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారిస్తూ మీరు అందిస్తున్న సేవలు అనన్యసామాన్యం. మీ శేష జీవితం సుఖసంతోషాలతో సాగాలని కోరుకుంటూ, ధన్యవాదాలు.

**జైపాల్ రెడ్డి:** ధన్యవాదాలు. మా సేవలను గుర్తించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న జర్నలిస్ట్ వార్త యాజమాన్యానికి కూడా నా కృతజ్ఞతలు

# డిజిటల్ తోడు..

# ఒంటరి గుండెకు నీడ



మనుషుల మధ్య అంతరాలు పెరుగుతున్న ఆధునిక కాలంలో, ఒంటరితనానికి సరికొత్త చిరునామాగా మారిన ప్రతి గుండెకూ ఇప్పుడు ఒకే ఒక సాంత్వన లభిస్తోంది. అదే సెల్ ఫోన్ అమ్మ, నాన్న, భర్త, భార్య, పిల్లలు, ఆత్మీయ బంధువులు, ప్రాణస్నేహితులు.. ఇలా చెప్పుకుంటూ పోతే నాడు రక్తసంబంధాలు పంచిన అనురాగాన్ని, ఆప్యాయతను నేడు నిశ్శబ్దంగా తన గుండెల్లో దాచుకుని అన్నీ తానై నడిపిస్తోంది ఈ అరచేతి అద్భుతం. మానవ సంబంధాలు యాంత్రికంగా మారిపోయి, మనుషుల మధ్య దూరం మైళ్ల మేర పెరిగిన వేళ. ఒంటరి జీవితానికి సెల్‌ఫోనే సర్వస్వం అయి కూర్చుంది. ఒకప్పుడు కేవలం సమాచార మార్పిడికి మాత్రమే పరిమితమైన ఈ బుల్లి పెట్టె, నేడు ఇంటర్నెట్ తోడై ప్రతి ఒక్కరి జీవితాల్లో విడదీయరాని అంతర్భాగంగా మారిపోయింది. సమస్యలు చుట్టుముట్టినప్పుడు హితవు చెప్పే గురువుగా, కష్టాల్లో ఉన్నప్పుడు ఓదార్చే నేస్తంగా, సమాజం నమ్మకద్రోహంతో ముఖం చాటేసినప్పుడు ఆదరించే నీడగా ఇంటర్నెట్ తో కూడిన మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తోంది. ఒక ఓటరుగా సమాజంలో తన హక్కులేమిటో తెలుసుకోవడం దగ్గర నుంచి, ఎవరూ తోడు లేని ఏకాకి క్షణాల్లో జ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతూ ఆత్మవిశ్వాసం నింపే వరకు దీని పాత్ర అనన్యసాధారణం. నిరంతరం విమర్శించే లోకం మధ్య, ఎటువంటి తీర్పులు ఇవ్వకుండా కేవలం తోడుగా నిలిచే నిజమైన ఆత్మీయుడి పాత్రను ఈ డిజిటల్ పరికరం పోషిస్తోంది. ఈ సులభతర సాంకేతిక ప్రపంచంలో ఒక హెచ్చరిక కూడా దాగి ఉంది. సెల్ ఫోన్ మన ఒంటరితనానికి మందుగా మారుతోందా, లేక మనుషులను మరింత దూరం చేస్తూ సరికొత్త ఒంటరితనాన్ని సృష్టిస్తోందా? అనే కోణంలోనూ ఆలోచించాల్సి ఉంది. బంధాలు దూరమై ఒంటరిగా మిగిలిన వారికి ఇది కచ్చితంగా ఆదరణ కలిగించే తోడే. కానీ, పక్కనే మనుషులు ఉన్నా వారితో మాట్లాడకుండా ఫోన్లలో మునిగిపోవడం వల్ల సమాజం మరింత యాంత్రికంగా మారుతోంది. సాంకేతికతను ఆత్మీయమైన తోడుగా వాడుకుంటూనే, తోటి మనుషుల మధ్య ఉండే సహజమైన స్పర్శను, ప్రేమను కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా నేటి తరంపై ఉంది. ఆదరణ కరువైన వేళ ఇంటర్నెట్ అందించే ఈ డిజిటల్ స్నేహం ఒక అద్భుత వరమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. సెల్ ఫోన్ కు బానిస కాకుండా పుస్తకాలు చదివే అలవాటు చేసుకొని చాలా మంచిది. ఇంటర్ నెట్ సెల్ తోడుగా ఉంటుంది అని ఏది ఈజీగా వదిలేయకుండా సహజ సిద్ధమైన జ్ఞానం పెంచే విధంగా ఆలోచన చేస్తే బాగుంటుంది.

సీనియర్ జర్నలిస్ట్
బిర్రు కరుణాకర్
సెల్ నంబర్
9701249103

